క్లుప్తంగా

వేడుకగా విజయ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో విజయ దుర్గాలమ్మ

అల్లిపురం: జెండాచెట్టు వీధిలో వెలసిన విజయదుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన దుర్గా హోమంలో ఆలయ అధ్యక్షుడు గురుమూర్తి దంపతులు పాల్గొని వైభవంగా నిర్వహించారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతి కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కర్రి నీలకంఠం తదితరులు

అల్లిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ కార్యవర్గ సభ్యులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కోశాధికారి వాసుపల్లి నారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అమ్మకు వందనం



స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో చిన్నారులతో మాతృమూర్తులు

జగదాంబ: మదర్స్ డే సందర్భంగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో తల్లులకు చిన్నారులు పాదాభివందనం చేశారు. ఆశ్రమానికి చెందిన ట్యూషన్ విద్యార్థులు ఆదివారం ఉదయాన్నే తల్లులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల పాదాల కింద స్వర్గం ఉందన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా పిల్లల ఆలనా పాలనా చూసుకునే అమ్మలను నిర్లక్ష్యంగా వదిలేయడం బాధాకరమన్నారు. చిన్నారులంతా మధ్యాహ్నం వరకు తల్లులతో గడిపారు. సంస్థ సభ్యులు డీకే బాబు, ఎస్.రమాప్రియా, ఎస్.శ్రీరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌తో చిక్కులు



ఫ్రూట్ మార్కెట్ వద్ద రహదారిపై ఉన్న చేపల మార్కెట్

జగదాంబ: చేపల మార్కెట్లు రహదారుల పైకి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. జీవీఎంసీ 39వ వార్డు ఫ్రూట్‌మార్కెట్ దగ్గర చేపల మార్కెట్ ఉంది. గతంలో ఓ కాలువపై ఇది ఉండడంతో ఎమ్మెల్యే వాసుపల్లి వారందరికీ 20 దుకాణాలు నిర్మింపజేసి ఇచ్చారు. అయితే వ్యాపారులు దుకాణాలు వదిలి రహదారిపైకి రావడంతో ఏవీఎన్ కళాశాల నుంచి వచ్చే వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వన్‌వే కావడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే చేపలకు సంబంధించిన మురికి నీటిని వ్యాపారులు రహదారిపైనే పారబోస్తుండడంతో దుర్గంధం వ్యాపించి వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చేపల దుకాణాలను రహదారిపై నుంచి తొలగింపజేయాలని స్థానికులు కోరుతున్నారు.

జై..భజరంగభళీ

● వాడవాడలా హనుమజ్జయంతి



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నీలమ్మ వేపచెట్టు వద్ద హనుమాన్ జయంతి నిర్వహిస్తున్న భక్తులు



అంబికాబాగ్ రామాలయంలో తమలపాకు అర్చనలో..



పాత లారీయార్డ్ ఆలయంలో కొలువైన హనుమాన్

అల్లిపురం: నియోజకవర్గంలో వాడవాడలా ఆదివారం హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో విశేష హోమం చేపట్టారు. ఉదయం నుంచి ఆంజనేయ స్వామికి సింధూరపూజ, ఆకుపూజ చేపట్టారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ పీవీ రమణమూర్తి ప్రారంభించారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, లింగం శ్రీనివాసరావు, వాసుపల్లి నారాయణరావు, బోణి దేవా, బొడ్డేటి కిషోర్, బొడ్డు పోలారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో..

అచ్చియ్యమ్మపేటలో వెలసిన అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామికి సింధూర పూజ, లక్ష తమలపాకుల పూజ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొన్నారు.

నీలమ్మ వేపచెట్టు ఆలయంలో..

నీలమ్మవేపచెట్టు ఆలయంలో మాజీ చైర్మన్ భీశెట్టి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే వెంకటేశ్వరమెట్టలోని వరసిద్ధి వినాయక మహిళా మండలి సభ్యులు ఆదివారం సాయంత్రం ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వై.చిన్నమ్మలు, గంధవరపు రామారావు, సుశీల, శాంతి, మానస, కళ్యాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జీఎస్ఎస్‌యూ ఆర్ఎం కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలోను, ఎర్రిగెడ్డ మెయిన్‌రోడ్డులో ఉన్న అభయ అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. విశాఖపట్టణం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు ఏఎస్ శర్మ పర్యవేక్షణలో సింధూరం, తమలపాకులు, పంచామృతాలతో స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డులో..

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పూజలు జరిగాయి. ఉచిత ప్రసాద వితరణ, మధ్యాహ్నం 1000 మందికి అన్న సమారాధన నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో స్వామివారి పూజ నిర్వహించామని, దేవాలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ కొండూరి గాయత్రి భక్తిరంజని నిర్వహించారు.

పూర్ణానంద సమాజంలో..

దాబాగార్డెన్స్: పూర్ణానంద సమాజంలో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సింధూర అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

అంబికాబాగ్ రామాలయంలో..

మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో వేడుకగా హనుమజ్జయంతి నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తమలపాకు, సింధూర అర్చనలు జరిపారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, భక్తులు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీటాకీస్ బస్టాప్ చిలకపేట ప్రాంతంలో అభయాంజనేయస్వామిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

పబ్లిక్ డిమాండ్

మ్యాన్‌హోల్ బాగు చేయరూ!



నూనెమిల్లు వీధిలో శిథిలమైన మ్యాన్‌హోల్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు నూనెమిల్లువీధిలోని ఓ మ్యాన్‌హోల్ పూర్తిగా శిథిలమైపోయింది. పూర్ణామార్కెట్‌లోని రద్దీగా ఉండే వాణిజ్య కేంద్రమైన ఈ వీధిలో హోల్‌సేల్ కిరాణా దుకాణాలు ఎక్కువగా ఉంటాయి. వాహనాల రాకపోకలూ అధికమే. హోల్‌సేల్ మార్కెట్ కావడంతో ఇక్కడికి నగర నలుమూలల నుంచి వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. అయితే శిథిలమైన ఈ మ్యాన్‌హోల్ వ్యాపారులు, ప్రజలు, వాహనాలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

సక్రమంగా చలివేంద్రాలు నిర్వహించాలి



నీళ్ల కుండీలు లేని టౌన్‌కొత్తరోడ్డు చలివేంద్రం

జగదాంబ: జీవీఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని చలివేంద్రాలు నిర్వహణ లోపం కారణంగా అనుకున్న రీతిలో సేవలు అందించలేకపోతున్నాయి. ఇక్కడ కావలసిన మేర తాగునీరు సరఫరా జరగడంలేదు. ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ ప్రజల సౌకర్యార్థం తాగునీరు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతి ఏటా వేసవి మొదట్లోనే ఈ చలివేంద్రాలను జీవీఎంసీ ఏర్పాటు చేసేది. అయితే అనుకోని కారణాల వలన ఈ ఏడాది ఆలస్యంగా ఏర్పాటు చేసినా తగినంత నీటిని అందించలేకపోతోంది. జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు డంపింగ్ యార్డు బయట పెట్టిన చలివేంద్రంలో కనీసం నీటికుండీలు కూడా లేకపోవడం విచారకరమని పలువురు వాపోతున్నారు. ఎప్పుడూ జనసంచారం ఉంటే ఈ ప్రాంతంలో ఎక్కువగా డంపింగ్ యార్డుకు సంబంధించి పారిశుధ్య సిబ్బంది మసులుతుంటారు. వారంతా ఈ చలివేంద్రానికి వస్తుంటారు. అయితే ఇక్కడ అరకొర సౌకర్యాలు చూసి వారు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి అన్ని చలివేంద్రాల్లో తగినంత నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చక్కటి పుస్తకం.. మంచి నేస్తంతో సమానం



విద్యార్థులకు పలు అంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఆరావతి

అల్లిపురం: చక్కటి పుస్తకం.. మంచి నేస్తంతో సమానం అని ఉపాధ్యాయురాలు ఎస్.ఆరావతి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలు బోధించారు. సెల్‌ఫోన్ వినియోగించుకుండా గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలు చదవటంతో పాటు విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని గుడిలేని దైవం అమ్మ అని వివరించారు. కల్మషం లేని ప్రేమ అమ్మది అని తెలిపారు. గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి శిక్షణ శిబిరం గురించి స్నేహితులకు చెప్పి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు అమ్మ కోసం (మాతృ దినోత్సవం) వివరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ హిందీ మాస్టర్ కె. రమేష్ పాల్గొని మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటూ అమ్మకే అగ్రతాంబూలం ఇస్తారని, సృష్టిలో ప్రతి ప్రాణికి మూల కారణం అమ్మ అని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి, కె. నందకిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి సహకరించండి



బాలిక కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

సీతమ్మధార: జీబీ సిండ్రోమ్‌తో గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైన ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి చిన్నారి తండ్రి హరికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గులియన్ బ్యారీ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య పరీక్షల్లో నాడి, రక్తపోటు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ శరీరం అచేతనంగా ఉంటుందన్నారు. రూ. 50 లక్షలు అప్పు చేసి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన ఈమె తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని గుర్తు చేశారు. తండ్రి పెన్షన్‌తోనే అరకొర వైద్యం అందిస్తు ఇక తాము ఆర్థికంగా తట్టుకోలేమని, వైద్యం నిలిపివేస్తామని కన్నీటి పర్యంతంతో వాపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి బాలిక వైద్యానికయ్యే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ పట్టా రమేష్, ఫోరం డాక్టర్ శకుంతల, కె.ఎల్లయ్య, డాక్టర్ ఆదిమూర్తి, హరిష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని ఆలయంలో ఏకాదశి పూజలు



దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక వ్రతాలు, సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

దాబాగార్డెన్స్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏసీపీ నరసింహమూర్తి సూచించారు. వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం విభిన్న అంశాలపై నిర్వహించిన మనో వికాస వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, దానిని సక్రమంగా వినియోగించుకుని ఉత్తమ విద్యార్థులుగా రాణించాలన్నారు. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు పాల్గొన్న విద్యార్థుకు, వారి తల్లిదండ్రులకు, శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు పి. జగన్మోహనరావు, సంస్థ ప్రతినిధులు జీవీఆర్ ప్రసాద్, డి. కనకవల్లి, మహిళా సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఎండలు

- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష
- వడదెబ్బ తగిలితే వైద్యులను సంప్రదించాలి



దాబాగార్డెన్స్: ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువ ఉంటోంది. సాయంత్రం 6 కానిదే తగ్గడం లేదు. దీనికితోడు ఉక్కపోత, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

జాగ్రత్తలు..

- ఆరుబయట పని చేసే వారు సూర్యరశ్మి నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. బయటికి వెళ్లే ముందు నీళ్లు వెంట తీసుకెళ్లాలి.
- ఎక్కువగా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు సేవిస్తూ ఉండాలి.
- తెలుపు, లేత రంగుల్లో ఉన్న పలుచని కాటన్ దుస్తులు ధరించాలి.
- తలకు ఎండ తగలకుండా టోపీ, రుమాలు చుట్టుకోవాలి.

పొంచి ఉన్న వడదెబ్బ ప్రమాదం..

- ఎండలు, వడగాడ్పుల సమయంలో బయట తిరగడం వల్ల వడదెబ్బకు గురవుతారు.
- తక్కువగా నీరు తాగడం, ద్రవపదార్థాలు తీసుకోకపోవడం, చల్లదనం ఇవ్వని దుస్తులు ధరించడం, చెమటను పీల్చని దుస్తులు, మద్యం సేవించడం వల్ల వడదెబ్బ సోకుతుంది.
- శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 104.9 డిగ్రీల వరకు పెరిగిపోయి, దానిని నియంత్రించే శక్తి కోల్పోవడమే వడదెబ్బగా పరిగణిస్తారు. దీనిని చాలా మంది జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అలా చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.

లక్షణాలు..

- రక్తప్రసరణ తగ్గి బీపీ డౌన్ అవుతుంది
- శరీరంతో పాటు పెదాలు, గోళ్ల రంగు మారుతుంది.
- ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి.
- కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి.
- నరాల సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- స్పృహ కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది
- మాటల్లో స్పష్టత తగ్గుతుంది.
- ఇతరులు చెప్పే మాటలను కూడా వినలేకపోతారు
- కొంత మంది కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది
- విపరీతమైన తలనొప్పి రావడం, హృదయ స్పందన బాగా పెరగడం, శ్వాస తీసుకోవడం కష్టమవడం, చర్మం బాగా కందిపోయి మంటగా ఉండటం, బుగ్గలు, మెడ, గొంతు, మోచేతులు, ఛాతీ భాగాలు ఎరుపెక్కడం మొదలైనవి..

నివారణ చర్యలు..

- తక్షణమే శరీర ఉష్ణోగ్రతను తగ్గించే చర్యలు చేపట్టకపోతే అవయవాలు శాశ్వతంగా పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది.
- వారిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు అలానే చేయాలి.
- చల్లని నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుముఖం పడుతుంది. బాత్‌టబ్‌లో ఐదు నుంచి పది నిమిషాలు గడపాలి. లేదా చల్లని దుప్పటిని శరీరమంతా కప్పాలి. ఆ తరువాత ఐస్ ముక్కలలతో శరీరమంతా అద్దాలి. ఇలా చేస్తే శరీరం వణుగు తుగ్గుతుంది. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- తీవ్రతను బట్టి ఆలస్యం చేయకుండా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. వెంటనే చికిత్స ప్రారంభం అయితే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చు.

ఏమి తినాలి..

వడదెబ్బ సోకిన వారు తాజా పండ్లు, కూరగాయలు, అదనంగా ద్రవపదార్థాలు, పండ్ల రసాలు, శక్తినిచ్చే శీతలపానీయాలు, మజ్జిగ తాగాలి.

వర్సిటీని సందర్శించిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశిష్ట స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి ఏసీసీవోఎం సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.రామలింగరాజు, ఓరాకిల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.నరసింహారావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ వారికి వివరించారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్ల ఏర్పాటు, క్రీడా మైదానాల అభివృద్ధి, తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ రామలింగరాజు ఏయూలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అదే విధంగా ఎంటెక్(జియోటెక్నికల్ ఇంజినీరింగ్)లో బంగారు పతకాన్ని ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని వర్సిటీ తరపున వీసీ సత్కరించారు. అనంతరం వారు ఏయూ స్టార్టప్ సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్రంలో మాలతికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థిని సత్తి ఎస్.ఎల్.ఎస్. కె.మాలతికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పి.కె.రత్నకుమార్, డాక్టర్ జి.ఎం.నరసింహారావు సంయుక్త పర్యవేక్షణలో తూర్పు కనుమల్లో వృక్షాలపై జరిపిన పరిశోధనకు ఆమెకు వర్సిటీ డాక్టరేట్ అందించింది. పుణ్యగిరి, అనంతగిరి, గాలికొండ ప్రాంతాలలో ఉన్న వివిధ స్టెరిడోఫైట్‌ల పంపిణీ, ఔషధ గుణాలను తన పరిశోధనలో భాగంగా అధ్యయనం చేశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను మాలతి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఉత్తరాలు రాస్తున్న స్థానికులు

ఆరిలోవ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. అనంతరం సుమారు 60 మంది 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి' అంటూ ప్రధానమంత్రి మోదీకి ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ప్రియాంక మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వకుండానే పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పలు కమిటీలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొనాలని ఆమె కోరారు. పోస్టుకార్డు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు జగన్, నుశ్చల్, నాగరాజు, హర్ష పాల్గొన్నారు.

విమ్స్‌లో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (విమ్స్)లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇక్కడ క్యాజువాలిటీ విభాగంలో ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించారు. దీనిని ఆదివారం ద్వారకా ఏసీపీ మూర్తి ప్రారంభించారు. విమ్స్ వైద్యులు, సిబ్బందికి అవుట్ పోస్టులో ఏరకమైన సేవలు అందుబాటులో ఉంటాయో వివరించారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సీతమ్మధార: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు గురుదేవ్ రవిశంకర్ జీ 68వ జన్మదినం సందర్భంగా పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, లయన్స్ ఇంటర్నేషనల్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సీతమ్మధారలోని సితార ఎన్‌క్లేవ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి, వైస్ చైర్మన్ వి.సాంబశివరావు, లైన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దుర్గాప్రసాద్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.